

# అగ్రహారం కథలు

## వేదుల సుభద్ర



పేరులో ఒక రకమయిన రాజసాన్నీ, కొంత గాంభీర్యాన్నీ సంతరించుకుని ఆంధ్రదేశమంతటా ఉన్న చిన్న చిన్న గ్రామాలే అగ్రహారాలు. ఎదురెదురుగా చిన్నదీ, పెద్దదీ రెండు రాములవారి గుళ్ళూ, ఆ ఊరి దేవుడి కాళ్ళు నిత్యమూ కడుగుతూ అప్పుడప్పుడు వొద్దికగానూ, మరోప్పుడు కాస్త ఉగ్రంగానూ ప్రవహించే కౌశికగా పిలవబడే గోదావరి, వెనకే పచ్చదనాల నెచ్చెలులు వరిచేలూ, వాటికి కాపలాగా నిలుచున్న అన్నదమ్ముల్లాంటి కొబ్బరి చెట్లూ, ఇలా ఎంతో మనోహరంగా ఉన్న చోట ఎదురెదుగా రోడ్డుకిరువైపులా ఉన్న ఓ పాతిక ఇళ్ళని కలిపి ఒక ఊరుగా కట్టేస్తే అదే ఈ అగ్రహారం. అమ్మమ్మగారి ఊరు కావడమే కాకుండా, మరుగున పడుతున్న ఆచార వ్యవహారాలనీ, సంప్రదాయాలనీ, అనుబంధాలని మాకు రుచి చూపించింది కూడ అగ్రహారమే. చిలిపితనాల చిన్నతనాలూ, కలల అలల కౌమారాలూ, జీవితాన స్థిరపడే ప్రయత్నంలో ఉద్యోగాలూ, సద్యోగాలూ, పెళ్ళిళ్ళూ, పేరంటాలూ ఇలా రకరకాల మెట్లు ఎక్కుతూ దిగుతూ మధ్యలో ఎక్కడో, ఎప్పుడో తెలియకుండానే పారేసుకున్న అమ్మ పెట్టిన కమ్మనైన తాయిలం లాంటి ఆ ఊరి జ్ఞాపకాలు ఇవి. మన ఇంట్లోనో, పక్కనో కనిపించి పలకరించే వ్యక్తుల్లాంటివే ఈ కథల్లో పాత్రలు. కొన్ని జరిగినవి, కొన్ని నే విన్నవీ , వీటికి కొద్దిగా నా సొంత కవిత్వాల రంగులూ, వర్ణనలూ, ఊహలు అద్దేసి ఆ చేనే(రా)తల కలనేతకి నేను పెట్టుకున్న పేరు అగ్రహారపు కథలు. - *రచయిత్రి(బెంగుళూరు)*

# తస్మైశ్రీ

**పాలదాలిలో పిడకలమీద కాగుతున్న పాలమీదకి మెల్లిగా,** వెచ్చగా చేరే చిక్కటి ఎర్రటి మీగడలా మెరుస్తోంది గోదారి మీద తొలిపొద్దులోని ఎండ. తులశమ్మ చుట్టూ ప్రదక్షిణ చేస్తున్న సీతాగౌరి గారి ముక్కునున్న ఏడు రాళ్ళ రవ్వల బేసరి మీద ఎండపడి ఆవిడ ముఖంకూడా అలాగే మెరుస్తోంది. సూర్యబింబాన్ని తలపిస్తూ ఎర్రగా మెరుస్తున్న ఆమె నుదిటి కుంకుమ. తులసికోటలో నీళ్ళు పోసి మందార పువ్వు తలలో తురుముకుని వెనక్కి అడుగులు వేసేంతలో..

" సీతా, ఎక్కడున్నావు? చూడు ఎవరొచ్చారో? "

వీధి అరుగు మీదనించి భర్త రామేశంగారు పిలవడంతో చేతిలో పంచపాత్ర అలాగే ఉంచుకుని ఒక్క పరుగున వీధి వైపు అడుగేసిందావిడ.

రామేశంగారి పూర్తి పేరు రామేశ్వరశర్మ. అగ్రహారానికి మూడు, నాలుగు మైళ్ళ దూరాన ఉన్న హైస్కూల్‌లో తెలుగూ, లెక్కలూ చెప్పేవారు. చెప్పడమంటే అలా, ఇలా కాదు.. ఒకసారి చెప్పారంటే అది గోడ మీద మేకు దిగినట్టు మెదడులో దిగిపోవలసిందే

' సైన్సూ , లెక్కలూ చెప్పడం సరే.. వీటితో పాటు తెలుగెలా? ' అని ఎవరైనా అడిగితే..

' నా పేరులో రాముడూ ఈశ్వరుడూ ఉన్నట్టే' అనేవారు.

ఆయన పేరుకి అతికినట్టు ఆయన భార్య పేరు కూడా సీతాగౌరి. ఆమె తండ్రిగారికి " ఏ తావునరా?" అనే త్యాగరాజకీర్తన అంటే ప్రాణం.. దానిలోంచే తీసి ఆవిడకి సీతాగౌరి అని పేరు పెట్టారుట. దానికి తగ్గట్టే రామేశ్వరుడితో వివాహం.. మేస్టారు మాత్రం - ఆవిడని సీతా, సీతమ్మా అనొకసారి గౌరి, గౌరమ్మా అని మరొకసారి పిలుస్తారు

ఆయన హెడ్ మాస్టారుగా ఉన్నప్పుడు స్కూల్‌కి ఉన్న క్రమశిక్షణ గురించీ, పిల్లలకి చదువు చెప్పడంలో ఆయన అవలంబించిన కొత్త పద్ధతులగురించి చుట్టుపక్కల ఊర్లలో ఎంతో గొప్పగా చెప్పుకునేవారు. తమ పిల్లలని ఆయన స్కూల్‌లో చేర్చడానికి ఎంతో శ్రద్ధ చూపేవారు.( ప్రైవేట్ల పేరిట డబ్బు తీసుకుని చదువు చెప్పడమంటే ఆయనకి అస్సలు పడదు. ఎవరికి ఎప్పుడు ఏం కావాలన్నా ఇంటికి వచ్చి చెప్పించుకోమనేవారు. వారింటి వీధరుగు మీదో, లేకపోతే పెరటి సావిట్లోనో చాప వేసుకుని అందరినీ వరసలో కూర్చోబెట్టి తెలియనివన్నీ చెప్పేవారు. గవర్నమెంటు స్కూల్ ఫీజుకి కూడ డబ్బు కష్టమైన పిల్లలకీ, తెలివి ఉండీ కూడా సరిగ్గా చదవలేని పిల్లలుంటే వారికీ ఆయన ఎంతో ప్రత్యేకమైన శ్రద్ధతో చెప్పేవారు. నిజానికి అలాంటి పిల్లలు పొరుగూరి వారైతే తన ఇంట్లోనే ఉంచుకుని మరీ చదువు చెప్పేవారు. అదో గురుకులంలా ఉండేది. చెప్పినది సరిగా వినకపోయినా, విన్నది సరిగ్గా చెయ్యకపోయినా ఆయనకి కోపం చటుక్కున వచ్చేది.

వారి ఒక్కగానొక్క అమ్మాయికీ చిన్నతనానే పెళ్ళి చేసేసారు. తెల్లగా బొమ్మలా ఉండే ఆ పిల్లని మేస్టారి శిష్యులందరూ పాపక్కా అని పిలిచేవారు.

అలా వారింట చేరిన కుర్రాళ్ళే ఇప్పుడు వీరింటి గుమ్మంలో నిల్చున్నది. ఖరీదైన బట్టలు వేసుకుని దర్జాగా దొరబాబుల్లా ఉన్నవారిని చూసి.. " ఎవరూ? మన సోముడూ, వీరేశూ, రాంబాబేనా? ఎన్నాళ్ళయ్యిందర్రా? మిమ్మల్ని చూసి !" అని ఆవిడ అంటూండగానే..

" అదేవిటి సీతమ్మా!, ఇంత ఎదిగిన వాళ్ళని చిన్నప్పటిలా అరే, ఒరే అంటున్నావు? " అని ఇంకా ఏదో అనబోతున్న మేస్టారి మాటలకి అడ్డుపడుతూ

" సర్లెండి.. వాళ్ళు నాకంటికెప్పుడూ ఒకేలా కనబడతారు.. నేనిలాగే అంటాను" అందావిడ.

" అమ్మా! నన్ను మళ్ళీ మర్చిపోయారు" అని ఉడుక్కున్నాడు బంగార్రాజు..

" అయ్యో, ఇంకా నయం.. మా రాజుగారినెలాగరా? మరిచిపోయేది.. ఉండు ఇప్పుడే వస్తాను" అని ఆవిడ గబగబా వంటింట్లోకి పరిగెత్తుకుని వెళ్ళి పెసరపప్పు నీళ్ళల్లో నానవేసి మళ్ళీ వచ్చింది.

" మన రాజుకు పెసరపప్పు పచ్చడి ఎంత ఇష్టమో కదా?పొద్దున్నే నిమ్మచెట్టు కొమ్మవిరిగేట్టు కాచినప్పుడు నిన్నే తలుచుకున్నానురా.. నిమ్మరసం పిండిన పెసర పచ్చడి, నిమ్మకాయ నీకెంత ఇష్టమో అని.. నువ్వేమో నన్ను మర్చిపోయానంటున్నావు" అంది.

" చాలా బావుంది! అలా నిలబెట్టే మాట్లాడతావా? మంచినీళ్ళూ, కాఫీలూ ఏమీ అడగవూ? పాపం ఎండన పడి వచ్చారు" అన్నారాయన.

" అయ్యో, మర్చేపోయాను సుమా! " అని మళ్ళీ లోపలకి వెళ్ళి కుండలోంచి చల్లటి నీళ్ళు తెచ్చి అందరికీ ఇచ్చింది ఆవిడ.

" ఇన్నాళ్ళకి గుర్తు వచ్చామన్నమాట మేము.. " అన్నారు ఆయన నిష్టూరంగా.

" ఊరుకోండి.. రాక రాక పిల్లలు ఇంటికి వస్తే.. మీ ధోరణిలో ఏమీ మార్పు లేదు కదా, ఈయనతో మనకెందుకర్రా? రండి లోపలకెళదాం " అని ఆవిడ లోపలకి దారితీసింది.

తల్లి కోడి వెనక పిల్లల్లా ఆవిడ వెనకే నలుగురూ లోపలకి జారుకున్నారు ఆయన మాటకి సమాధానం చెప్పకుండానే.

" ఏళ్ళు గడిచినా నువ్వు మాత్రం మారావా? వాళ్ళు పదో క్లాస్ లో ఉండగా ఎలా ఉన్నావో ఇప్పుడు పదేళ్ళ తర్వాత అదే వ్యవహారం, ఎప్పుడూ వాళ్ళంటేనే నీకిష్టం " అన్నారు ఆయన వెక్కిరిసున్నట్టుగా. మిగతా విషయాలలో ఎంతో అన్యోన్యంగా ఉండే దంపతులు ఈ పిల్లల విషయానికొచ్చేసరికి ఎదురూ బొదురూ గా ఉండేవారు. ఆవిడెప్పుడూ వాళ్ళ పక్షం.. వాళ్ళనొక్క మాట అననిచ్చేది కాదు.

ఆ మాటతో ఇంట్లోని ఆరుగురూ పదేళ్ళు వెనక్కి వెళ్ళిపోయారు అప్రయత్నంగానే. అప్పుడే నడక నేర్చిన లేగదూడ కూడా ముందుకు నడుస్తున్నాననుకుంటూనే వెనక్కి అడుగులు వేస్తోంది.

---

మేస్టారి వెనకాల భయం భయంగా వచ్చారు నలుగురు పిల్లలు.. చారల చొక్కాలు, పొట్టి నిక్కర్లు వేసుకుని.ఇద్దరేమో కొంచం పొడుగ్గా సన్నగా ఉన్నారు. మిగతా ఇద్దరూ మాములుగా ఉన్నారు.

" ఎవరండీ వీళ్ళు?" అందావిడ

" మన పిల్లలే.. తన స్కూల్‌లో పిల్లలందరినీ అలాగే అంటారాయన. వీళ్ళది కూచిమంచి వారి అగ్రహారం. వీడిదేమో పేరూరు.. ఇదిగో ఈ పొట్టిరాజుగారిదేమో అనాతవరం. మనింటోనే ఉంటారు చదువులయ్యేదాకా.. వాళ్ళకేం కావాలో చూడు.. " అన్నారాయన. మరో మాట లేకుండా అందరినీ లోపలకి తీసుకెళ్ళిందావిడ.

వేడి వేడి అన్నం మీద కమ్మటి నెయ్యి వేసి, దానితో పెసరపచ్చడి కలుపుకు తిన్న వాళ్ళకి ఆ రోజు స్వర్గం గుర్తుకు వచ్చింది. దానికి తోడు మిరియాల చారు.

" మీ మాస్టారికి గొంతు బావోలేదని కూరా, గీరా చెయ్యలేదు ఈ పూట. ఇప్పటివి తినేయండి రేపు మీకేంకావలిస్తే అది వండి పెడతాను.. పచ్చి పచ్చడి.. నెయ్యి ఎక్కువ వేసుకుని తినకపోతే కడుపు నొప్పి వస్తుంది " అని కొసరి కొసరి వడ్డించింది.

ఆవిడ ఎప్పుడు మాట్లాడినా ఇలాగే రెండేసి మాటలంటూ ఉంటుంది. కూరా, గీరా, నగా నట్రా,ఉప్పూ గిప్పూ.. ఇలాగన్నమాట

" నువ్వు ఇలా నేతి అన్నాలు పెడితే వాళ్ళు చదివినట్టే ! " అన్నారాయన..

" సరేలెండి.. ఈ పూటకేగా? " అని చిక్కటి మజ్జిగ పోసింది వాళ్ళకి. అప్పటినించీ మొదలు.. దాదాపు ఐదేళ్ళు ఆ నలుగురూ కూడా వారింట్లోనే ఉన్నారు.

" ఏవండీ.. ఈ పచ్చడెంతబావుందో? " అన్నాడు రాజు.

" ఏవండీ ఏమిట్రా అమ్మా! అని పిలువు. ". అని ఆవిడ ముద్దుగా కసిరింది.. అప్పటీనించీ ఆవిడని అమ్మా అనే పిలిచేవారు.

మేస్టారు నాలుగున్నరకి అలారం పెట్టేవారు. లేచి కాలకృత్యాలు తీర్చుకుని స్నానం చేసి తయారయ్యి ఐదు గంటలకల్లా చదువుకి తయారుగా ఉండాలి. ఏడున్నర దాకా చదివి అప్పుడు అమ్మగారు పెట్టిన చద్దన్నం తిని బడికి బయలుదేరాలి. ఈ లోపున అమ్మగారికి నీళ్ళు కావాలంటే తోడడమూ, పూజకి పువ్వులో, పప్పులోకి మావిడికాయలో కొయ్యడమూ లాంటివి వాళ్ళే చేసేవారు.

అలాంటి పని ఎవరు చేసినా ఇద్దరూ కూడా కోప్పడేవారు.

" మీరు మాకేం పని చెయ్యక్కరలేదు.. చదువుకోండి చాలు" అని.

బడినించి వచ్చిన వెంటనే అన్నం తినేసి కాసేపు గోపాలం గారి గ్రౌండులోకి వెళ్ళి ఆడుకొని వచ్చి, నూతి గట్టున స్నానాలు చేసి సాయంత్రం చదువు.. భోజనమయ్యాకా తెలియనివి చెప్పించుకోవడమూ, మళ్ళీ చదువుకోవడమూ ఇలా సాగేది వారి దినచర్య.

నాలుగున్నరకి లేవాలంటే గగనంగా ఉండేది వీరేశానికి. కంటి రెప్పలు రెండూ అంటుకుపోయి ఓ పట్టాన తెరుచుకునేవి కాదు.

" లేచార్రా? " అని మేస్టారు కేక పెట్టగానే చటుక్కున లేవాలి..

"మిగతా ఇద్దరూ లేచారు కదా, వాళ్ళ స్నానాలూ, జపాలు అయ్యేలోపల నువ్వు లేస్తావు లేరా." అని అతనికి చెప్తూ

"వాళ్ళెప్పుడో లేచారు.. మీరు లేచారా?"అని అతన్నే ఎదురు అడిగేది ఆవిడ.

"నువ్వు అక్కడుండగా వాడు లేవడు,, నువ్వు మండువాలోంచి ఇవతలకి వస్తావా? " అని అనేవారు. "ఇంక తప్పదు లేరా నాయనా.. " అని అప్పుడు లేపేది.

ఓ పావుగంట పడక దొరికినా దొరికినట్టే అని ఆనందపడి పోయేవాడు వీరసు.

"ఎముకలకి బలం, ఒంటికి బలం అని ఓ.. గానుగ నూనెలు వేసి అంతత చద్దన్నాలు పెట్టకు.. అక్కడకెళ్ళి నిద్రపోతారు.. చదువుకునే వాళ్ళకెప్పుడూ కడుపు మూడు వంతులే "నిండాలి అని రుసరుసలాడేవారు..

"అలాగే లెండి" అని ఆయనతో అని , "పొద్దున్న పోతే సాయంత్రానికొస్తారు వెర్రి నాగన్నలు.. రెండు ముద్దలు తిననివ్వరు మీరు.. తినండ్రా.. బళ్ళో నిద్దర్లూ, గిద్దర్లూ పోకండి.. మీతోపాటు నాకూ పడతాయి అక్షింతలు అనేది" ఆవిడ. రోజూ అందరి నుదిటినా పూజ కుంకుమ ఉంచి పంపేది.

ఆవిడ చేత్తో ఏం చేసినా మహత్తరంగా ఉండేది.. ఎదిగే వయసేమో ఓ రెండు ముద్దలు ఎక్కువే తినేవారు. దానితో రాత్రి నిద్ర ఆపుకోవడం ఒక కష్టమైతే, చదువుకోవడం మరొక కష్టం.

అప్పుడావిడ "అలా కూర్చుని కాకుండా అటూ , ఇటూ తిరుగుతూ చదవండ్రా, నిద్ర రాదు" అంటూనే వేడి వేడి టీ తెచ్చి ఇచ్చేది. అంతే కాదు వాళ్ళంతా రగ్గులు కప్పుకుని మెత్తటి బొంతలు పరిచిన నులక మంచాల మీద పడుకుని నిద్రపోయాక కానీ కదిలేది కాదు.

"మేము పడుకుంటం లెండమ్మా, మీరెందుకు కూర్చోవడం? "అంటే.. నవ్వేది..

ఒత్తులు చేసుకుంటూనో, చీరలకి అంచులు కుట్టుకుంటూనో అక్కడే వాళ్ళందరినీ చూస్తూ కూర్చునేది. ఎవరి పుట్టినరోజయినా వారికేది ఇష్టమో గుర్తు పెట్టుకుని మరీ ఒండేది.

'ఘల్లు ఘల్లున కాళ్ళ గజ్జెలందెలు మ్రోగ.. ' అన్నట్టు ఆవిడ లయబద్ధంగా, కాలి కున్న మువ్వలు మెత్తగా సవ్వడి చేస్తూ వీది గుమ్మం కడగడానికి వెళుతుంటే వీళ్ళు నడిచి వస్తున్న లక్ష్మీ దేవిని చూసినట్టుగా చూసేవారు. అయితే ఆ విడ కళగలిగిన లక్ష్మీదేవే తప్ప నగల గలగలలు తెలియని లక్ష్మీదేవి. మేస్టారికి వచ్చేజీతంలో చాలా భాగం ఇలాంటి పిల్లల మీదే ఖర్చు అవుతుందని వాళ్ళకీ తెలుసు. ఇల్లు సొంతది, ఒక ఆవు ఉంది కనక అద్దె, పాలు చూసుకోనక్కరలేదు. మిగతా ఖర్చులకీ, వీళ్ళు నలుగురివీ అవసరాలకీ ఎక్కడనించీ తెచ్చేవారో మరి..

శ్రావణమాసంలో వరలక్ష్మీ వ్రతానికి ఎదురింటి వెంకమ్మగారు చక్కటి పలకసర్లు చేయించుకున్నారు నాలుగువరసలది.. పేరంటానికెళ్ళినప్పుడు ఆవిడ అమ్మవారిముందు అది పెట్టి పూజ చేసుకుని మెడలో వేసుకుని నలుగురికీ చూపించింది. స్వతహాగా నగలూ, నాణాల మీద పెద్ద మోజు లేకపోయినా సీతమ్మగారి ఆడమనసు ఆ నగను చూసి చాలా ముచ్చట పడింది. అమ్మవారి పూజ తాలుకు పసుపు కుంకుమలు అక్కడక్కడా పడి ఆ గొలుసుకో వింత అందాన్నిచ్చాయి. అదావిడ మనసులో అలాగే ఉండిపోయింది. రాత్రి మేస్టారితో చెప్పిందావిడ. ఎదురింటావిడ గొలుసెంత బావుందో తనకీఅలాంటిది చేయించుకోవాలని ఉందని. ఆ మాటలు అనుకోకుండా వీళ్ళ నలుగురి చెవిలోనూ పడ్డాయి.

నలుగురిలోనూ వీరేశం వాళ్ళ నాన్నే అంతో ఇంతో సంపాదించేవాడు. కానీ అది వాళ్ళ సంసారానికే సరిపోయేది కాదు. అందుకే కొడుకుని పనిలో పెట్టేస్తాను.. ఇంక నావల్ల కాదంటే అతన్ని కాదని తనతో తీసుకుని వచ్చారు మేస్టారు.

బంగార్రాజుకి అమ్మ లేదు. సవతి తల్లి సణుగుడుతో అతనికి ఇంట్లో తిండే కాదు, ప్రశాంతత కూడా కరువైతే వాళ్ళ నాన్నకి చెప్పి తీసుకొచ్చారు.

రాంబాబుకి నాన్న చిన్నతనానే పోయాడు. వాళ్ళ అమ్మ తన అన్నయ్యలింట పనీ పాటా చేస్తూ వాళ్ళింట్లోనే ఉంటుంది.

సోముడు వాళ్ళ నాన్నకొక్కడే కొడుకు.. జరుగుబాటుకు లోటు లేదు.. ఎంత చెప్పినా చదువు విలువ తెలుసుకోలేని మూర్ఖుడు. పరమ పిసినారి, తండ్రి బుల్లబ్బులు. తన కిరాణా కొట్టు చూసుకోడానికి ఐదో ఏడో చాలు కదా అంటాడు. సోము కి చదువన్నా, ఆటపాటలన్నా శ్రద్ధ. కబాడీ, కో, కో చాలా బాగా ఆడేవాడు. తన చదువు తన తండ్రి వల్ల సాగదేమో అని భయపడి మేస్టారి దగ్గర ఏడిస్తే.. ' నా ఇంట్లో చదువుకుందువుగానీ. వారానికోసారి వెళ్ళి చూద్దువుగానిలే మీ అమ్మా. నాన్నని' అని వాళ్ళకి నచ్చచెప్పి తీసుకొచ్చారు. అతి కష్టం మీద కొడుకు ఫీజు చాలా అనిష్టంగా కడతాడు బుల్లబ్బులు..

మిగతా ముగ్గురికీ, అన్నింటికీ తడుముకోవడమే. అందుకే బంగార్రాజు నాన్న అప్పుడప్పుడూ వచ్చి వాడి చేతిలో ఓరెండో, ఐదో రూపాయలు పెట్టి, ఫీజు డబ్బులు మేస్టారికిచ్చి దండం పెట్టి వెళ్ళేవాడు. మిగతా ఇద్దరికీ అన్ని మేస్టారే.. అలా ఆయనకొచ్చే మామూలు జీతం సరిగ్గా సరిపోయేది ఇంటికీ, వీళ్ళ ఖర్చులకీ.

' ఇంక పలకసర్లు తేవడమెలా? ' అనుకున్నారు కానీ తన జీవిత సహచరి లేక లేక అడిగిన కోరికని కాదనలేక పోయారు.

-----------------------

"ఎప్పుడూ తిన్నారో ఏమిటో? ఒక్క అరగంట అలా కూర్చోండర్రా, వడ్డించేస్తాను" అని ఆవిడ లోపలకి వెళ్ళింది. మిత్రులు నలుగురూ మళ్ళీ మేస్టారి దగ్గర కూర్చుని తమ ఉద్యోగాలూ, వ్యవహారాలగురించి మాట్లాడడం మొదలు పెట్టారు. అయినా మనసు లోపలనించి వస్తున్న వాసనలమీదా, పోపుచిటపటలూ, మట్టిగాజుల గలగలల మీదే ఉంది.

"మీ ఇద్దరిలోనూ ఏమీ మార్పు లేదు మేస్టారూ" అన్నాడు రాంబాబు.

"ఏం మారతామనుకున్నార్రా?" అంటూ నవ్వారు మేస్టారు.

అందరూ భయంగా ఉన్నారు. బెదురు చూపులు చూస్తున్నట్టుగా, ఏదో చెప్పాలని తాపత్రయపడుతున్నట్టుగా అనిపిస్తోంది మేస్టారికి.

"విషయమేమిటో చెప్పండి? అలా నీళ్ళు నములుతారేం? ఇదిగో మీరొచ్చారని ఇప్పుడు మీ అమ్మగారు, బజ్జీలో బూరెలో వండుతుంది.. అవి నములుదురుగాని ఆనక్క" అన్నారు. అదీ..

"మేస్టారూ మరేమో. " హఠాత్తుగా అందరూ పన్నెండేళ్ళు వెనక్కి వెళ్ళిపోయినట్టు ఉన్నారు..

వీరేశం ధైర్యం చేసి తన బాగ్ లోంచి ఒక పర్స్ తీసి మేస్టారి చేతిలో పెట్టాడు. అది పెద్ద పెద్ద నగరాల్లో నగల కొట్టువాళ్ళిచ్చే పర్స్.. బరువుగా ఉంది..

" ఏవిట్రా ఇది? "అని మేస్టారు అడిగేంతలోనే అందరూ ఒకే కంఠంతో చెప్పారు..

"ఇది ఐదేళ్ళు కళ్ళల్లో పెట్టుకుని మమ్మల్ని కన్నబిడ్డలకంటే ఎక్కువగా చూసుకున్న అమ్మగారికోసం. ఆవిడ ఏనాటినించో మనసుపడిన పలకసర్లు గొలుసు.. దయచేసి ఇది మీరు చెప్పిన చదువుకి మేము ఇస్తున్న మూల్యం అని మాత్రం అనుకోకండి మేస్టారూ.. మా పెద్ద చదువులు అయ్యాకా, సంపాదించి కనీసం అమ్మగారి అరవైయ్యవ పుట్టినరోజుకి తీసుకుని రావాలని మేముఎప్పటినించో అనుకున్నది. మీరు కాదనరనే మా నమ్మకం "అని ఆయన చేతిలో పెట్టేసి అందరూ పెరట్లోకి వెళ్ళిపోయారు.

పెరట్లో తమతో పాటే పెరిగిన నందివర్ధనం చెట్టుని చూస్తున్నాడు సోము..

" ఏమండీ! పాపం మన సోముకి సరి అయిన బట్టలే లేవండీ.. నిన్న నన్ను సూది దారం అడిగి వచ్చీ రాని కుట్టు ఎగుడు దిగుడు గా కుట్టుకుంటూ ఉంటే నేనే తీసుకుని కుట్టు వేసాను. చొక్కలన్నీ పిగిలి పోయాయి.. అందరిలోకీ పొడుగేమో, నిక్కర్లన్నీ పొట్టి అయిపోయాయి. స్కూల్ కెళ్ళే పిల్లాడు కనీసం రెండు మూడు జతల బట్టలుండాలి కదా.. మీరు రేపు పిచిక వారి కొట్లో తాను చింపించుకుని రండి.. కుట్టిద్దాం " అందావిడ.

"నిజమే అనుకో.. కానీ ఇప్పుడు కనీసం రెండు వందలైనా కావాలి కదా దానికి.. ఒకడికి కుట్టించి మిగతావాళ్ళనెలా వదిలేయడం చెప్పు? " అన్నారు.

"ఆమాటా నిజమే.. పోనీ అందరికీ తలో జతా కొందాం, వీడికి ఇంకొకటి కొనండి" అందావిడ..

"నువ్వు ముచ్చట పడుతున్నావని నీ గొలుసు కోసం డబ్బు నెలకింతని దాస్తున్నాను అదే ఓ మూడు నాలుగు వందలుంటుందేమో" అన్నారు..

"ఇంట్లో ఉండేదాన్ని నేను.. బయటకెళ్ళే పిల్లలు వాళ్ళూ.. మీరే చూడండి ఏది ముఖ్యమో.. నా గొలుసు వచ్చే ఏడాది కొనుక్కోవచ్చులెండి ముందు వీళ్ళ బట్టలసంగతి చూడండి. " అందావిడ.

" సరే.. నీ ఇష్టం!.. "అన్నారాయన..

అలా దాచిన డబ్బులో మూడు వందలకి కాళ్ళొచ్చి వాళ్ళ వంటిమీదకి కొత్త బట్టలొచ్చాయి. అనుకోకుండా ఆది విన్న సోము ఆ రోజుని ఎప్పటికీ మర్చిపోలేడు.

రాంబాబు తులసి గట్టుదగ్గర కూర్చుని అందంగా, పచ్చగా ఏపుగా ఎదిగిన తులసిని చూస్తున్నారు. "తులశమ్మ ఎంత ఆరోగ్యంగా ఉంటే ఇంటిల్లిపాదికీ అంత శుభమ్రా, ముఖ్యంగా ఇంటి యజమానికి.. " అనేవారు అమ్మగారు ఎప్పుడూ..

"ఒరే.. జాగ్రత్తరా, కిందపడ్డావంటే కాళ్ళు కీళ్ళు విరుగుతాయి.. ఇప్పుడు నా మావిడికాయకేం తక్కువ రాలేదులే "అనేవారు.. జామకాయల కోసమో, మావిడికాయల కోసమో చెట్టెక్కినప్పుడల్లా ఆవిడ మనసు ఎంతో ఆతుత పడేది.. ఆవిడ భయపడ్డట్టే స్కూల్లో లాంగ్ జంప్ చేస్తూ కాలు జారి పడడంలో ఎముక విరిగి కింద పడ్డాడు. విరిగిన ఎముక అతకడానికి చాలా రోజులు పట్టింది. మేస్టారేమో ముందు రిక్షా లోనూ, తర్వాత సైకిల్ మీదా కూర్చోబెట్టుకుని పెద్ద డాక్టర్ గారి దగ్గర కట్టు కట్టించేవారు. విరిగిన కాలికి. అమ్మగారేమో రోజూ మిగతా దెబ్బలకి వెన్నపూస రాసి, లేదా కర్పూర తైలం రాసి మర్దనా చేసేవారు... మంచమ్మీద లేవలేని స్థితిలో పడుంటే కన్నతల్లిలా అన్ని సేవలూ చేసారు.

' వీడికిప్పుడు శక్తి రావాలంటే మంచి తిండి అవసరం' అని బయట పాలు, ఆపిల్ పళ్ళూ అవీ కొనేవారు. తనకి తగ్గి తిరిగి నడిచే దాకా అ రెండు నెలల్లో అమ్మగారి నగకోసం దాచిన డబ్బులో సింహభాగం దానికే చెల్లయిపోయింది.

" స్నానాలకి లేవండ్రా, వంటయిపోవచ్చింది" అని కేక వేసారావిడ. బంగార్రాజు పెదవులమీద అప్రయత్నంగానే నవ్వు వచ్చింది. అతనికి స్నానం చెయాలన్నా, త్వరగా తెమలాలన్నా బద్ధకం.. అది తెలిసిన అమ్మగారు మేస్టారు తిడతారని అందరికంటే

"వీడే ముందు వెళ్ళాడు నీళ్ళకి.. ఏరా చెప్పవేం?" అనేది. తర్వాత మేస్టారు దేవతార్చన చేస్తుంటే "'వంటయిపోవస్తోంది.. వెళ్ళరా స్నానం కానిచ్చేసి రా".. అని తరిమేది.. సెలవొచ్చిననాడు.

బంగార్రాజు పదోక్లాస్ లో స్కూల్ ఫస్ట్ న పాస్ అయితే ఆవిడ ఎంతో సంబరపడిపోయింది.

"చూసారా, నేను చెప్పలేదూ!.. బంగారంలాంటి పేరుంటే పొట్టిరాజూ అని వెక్కిరిస్తారు. పొట్టివాడే కానీ గట్టిగాడండీ మన రాజుగారు.. వీడిని పెద్ద చదువులు చదివించండీ" అని.. కొబ్బరినూజు ఉండలు అందరికీ పెడుతూ..

ఇంటర్ లో ప్రత్యేకమైనప్రైవేటు పెట్టించారు బంగార్రాజుకి. అలా ఇంజనీరింగ్ చదువుకున్నాడు. దానికి కూడా నెల నెలా డబ్బు పంపేవారు. 'తన చదువుకే అయిపోయింది అమ్మగారి బంగారపు సొమ్ము' అనుకున్నాడు బంగార్రాజు బాధగా.

వీరేశం శ్రద్ధ చూసి అతని తండ్రి మారి.. 'ఎంత వీలైతే అంత తప్పకుండా చదివిస్తాను' అన్నా సరే.. 'అందరితో పాటు ఉంటాడు.కలిసి అన్నదమ్ముల్లా పెరుగుతున్నారు వాళ్ళని విడగొట్టడమెందుకూ' అని మేస్టారు అన్నప్పుడు సరే అనడం తప్ప ఏమీ చెయ్యలేకపోయాడు. ఐతే అప్పటినించీ కొడుకు జీతం మాత్రం కట్టేసేవాడు. అయినా అతనికీ తెలుసు ఎంత కష్టపడి దంపతులిద్దరూ తమని ఇలా తీర్చిదిద్దారో!

---

మేస్టారికీ, పక్కనే వాళ్ళకీ విస్తళ్ళు వేసింది సీతమ్మగారు.

" వయసయిపోయిందేమో అనిపిస్తోందర్రా!, ఈ మధ్యన ఉప్పూ కారాలు సరిగ్గాలేవంటున్నారుమీ మేస్టారు. మీరు చూడండి ఎలా ఉందో? " అని ముందు పచ్చడీ, తర్వాత పొట్లకాయ కొబ్బరి కోరు పెట్టిన కూరా వడ్డించింది..

ఆత్రంగా వేడి అన్నంలో చెయ్యి పెట్టిన బంగార్రాజుని.. "ఉండరా వెర్రి నాగన్నా, ఎప్పుడూ అదే ఆత్రం.. నెయ్యి వెయ్యనీ "అని చిన్న గిన్నెలోంచి నెయ్యి వడ్డించింది.

కాలం కరిగినా కరగని ఆ ప్రేమనీ, మారని ఆచేతి రుచినీ ఆస్వాదిస్తూ మాట రాక ఉండిపోయారు మిత్రులు..

"కింద చూసుకుని తినరా, ఎలా మెతుకులు పోసుకుంటున్నావో చూడు, పులుసు వెయ్యనా అని అడుగుతున్న అమ్మగారిని అప్పుడు పన్నెండేళ్ళక్రితం చూసినట్టే చూసాడు సోముడు..

"ఇంట్లో బాగానె తింటానమ్మా, మీ దగ్గరకి వచ్చేసరికి మళ్ళీ చిన్నతనం వచ్చేసిందేమో నాదగ్గరకి" అంటూ నవ్వాడు. వడియాలు అని ఆవిడ వేసిన తక్షణం ఖాళీ చేసారు..

"మీ చీర మీద పెట్టిన వడియాల రుచికి ఏదీ సాటి రాదమ్మా "అన్నడు వీరేశం. మారు మాటాడకుండా ఆవిడ ఏది వడ్డిస్తే అది క్షణాల మీద తినేస్తున్నాడు.

మేస్టారు గంభీరంగా చూస్తున్నారు.. అక్కడ తనొకడున్నాడన్న మాటే మరిచినట్టున్న వాళ్ళని..

" సీతా.. ఇదేదో పిల్లలిచ్చారు నీకోసమే తెచ్చారుట చూడు " అన్నారాయన పలకసర్లుఉన్న డబ్బా ఆవిడ చేతిలో పెడుతూ..

" ఏవిటండీ ఇది?ఏదో సర్సులా ఉంది " అని మెల్లిగా తెరిచి చూసిన ఆవిడ కళ్ళు విచ్చిన నందివర్ధనం పూలయ్యాయి.

" చాలా బావుంది.. ఎవరిది? " అంది.. ఎప్పుడో విడ మనసుపడిన సంగతి విడకి గుర్తు లేదు.. అందుకే అలా అడిగింది.

" మీకోసమే తెచ్చామమ్మా అన్నారు ముక్తకంఠంతో..

"అంతే కాదు.. ఈ రోజు మీ అరవైయ్యవ పుట్టినరోజు.. మీకు, మేస్టారికి బట్టలు పెట్టి ఈ గొలుసు మీకివ్వాలని గత ఐదేళ్ళుగా మా సంకల్పం, రోజుల్లో మీరెంతగా ఈ నగ కావాలనుకున్నారో మాకు బాగా తెలుసునమ్మా " అన్నారు.

ఆ మాటలకి ప్రశాంతంగా ఉండే ఆమె ముఖంలోకి చిరుకోపం వచ్చింది.

"మీకేవన్నా వెర్రేవిట్రా? ఏదో అప్పుడు చిన్నతనంలో అనుకున్నాను నాకూ ఉంటే బావుంటుందని.. అంతేకాని నాకేం బంగారం మీద మోజు లేదనిమీకు మాత్రం తెలియదూ? ఊరికే ఇప్పుడింత డబ్బు తగలేసి నాకు ఇది తేవాలా? ఏం పిల్లలల్లా మీరు? ఆయన దగ్గర చదువుకుని పెద్దవాళ్ళయ్యారు ఈ తృప్తి చాలదూ.. రేపు మీకు పెళ్ళీ, గిళ్ళీ అయి పిల్లా, జెల్లా తయారయితే అప్పుడు మీకే డబ్బు అవసరం.. ఇప్పుడీ ముసలి సీతమ్మ నగలేసుకుందా లేదా అని ఎవరూ చూసేది లేదు.. బాగా చదువుకుని శుభ్రంగా ఉద్యోగాలు చేసుకుంటూ పలుకులమ్మ ముద్దు బిడ్డల్లా ఉన్నారు.అంతే చాలు ఈ పలకసర్లెందుకర్రా ? " అంది.

అంతేకాదు.. "మీరివ్వడమూ నేను తీసుకోవడమూనా.. చాల్బాలు.. నాకేమీ వద్దు" అని పక్కన పెట్టేసింది.

ఆవిడలా అంటుందని ఊహించని మిత్రులు కంగారుపడ్డారు.

"అది కాదమ్మా.. ఇందులో మీరు తప్పుగా అనుకోవడానికేముంది? మాకు తెలుసమ్మా మీరెంత ముచ్చట పడ్డారో ఆనాడు.. కానీ డబ్బు తీసుకోరు మేస్టారు ప్రభుత్వం వారు జీతం ఇస్తారు కదా అని.. మిగతావారి మాట ఎలా ఉన్నా.. మా నలుగురినీ ఇంట్లో ఉంచుకుని కన్న తల్లి తండ్రులు కూడా చెయ్యనంతగా సాకారు.. చూసారు.. దానికి ఏమిచ్చినా తీరే ఋణం కాదమ్మా ఇది..

"అందుకని, ఆయనచెప్పిన చదువుకి డబ్బు తీసుకోరు కనక నేను పెట్టిన పట్టెడన్నానికి మారుగా తెచ్చారన్నమాట.. " అంది కోపంగా.

"అలాకాదమ్మా, పాపక్కకంటే మమ్మల్ని ఎక్కువగా చూసుకున్నారే మేము మీకేమీ చెయ్యకూడదా?

నాకిష్టమైన పచ్చడి అన్చెప్పి ఈ రొజుకీ చేస్తారే.. అలాంటిది మీరు మనసు పడినఒక్క కోరిక తీర్చతగమా అమ్మా"

"మా చేతులు పట్టుకుని మేస్టారు వచ్చినప్పుడు.. నాతో ఒక్క మాటైనా చెప్పకుండానే ఎందుకు తీసుకొచ్చారు ఈ పిల్లల్ని అని ఒక్క మాట అడగలేదు మీరు..

మనకే అంతంత మాత్రంగా ఉంటే వీళ్ళని ఎలా చూస్తాం? అని మాటవరసకైనా అనలేదు..

పేరంటానికి పాత పట్టుచీర కట్టుకుని వెళ్ళారే తప్ప , వీళ్ళకి పాంటూ చొక్కాలెందుకు? నేనో పట్టు చీర కొనుక్కుంటానని ఏ నాడూ అనుకోలేదు..

ఎదిగే పిల్లలు.. రెండు ముద్దలెక్కువ తింటే బలంగా ఉంటారు అని ఉన్నదంతా మాకే పెట్టి అప్పుడప్పుడూ ఏకాదశి ని నెలకి మూడు నాలుగు సార్లు రప్పించారు..

మా కాల్లోముల్లు గుచ్చుకుంటే మీ కంట్లో నీళ్ళొచ్చి తల్లడిల్లిపోయేవారు.

పాపక్క ఇంటి గృహ ప్రవేశానికి కూడా వెళ్ళలేకపోయారు నా కాలు విరిగిందని.. మేస్టారిని మాత్రం పంపారు. ఇలా ఒకటా రెండా.. ఎన్నని చెప్పగలమమ్మా?

అలాంటి మీరు మొదటిసారి మనసుపడిన వస్తువమ్మా ఇది.. దీనికి కావలసిన డబ్బు కూర్చడానికి మాకూ కొంత టైము పట్టింది. ఎలాగైనా ఇది పట్టుకునే మీదగ్గరకి రావాలని ఎప్పుడో అనుకున్నామమ్మా. ' గురు బ్రహ్మ, గురుర్విష్ణు అనేది ఎంతనిజమో మాకూ తెలుసు ఒకప్పుడు.. ఇప్పుడు మాత్రంఇంకో విషయం కూడా తెలిసి 'గురుపత్నీ సాక్షాత్ కన్నతల్లీ, తస్మైశ్రీ మాతృమూర్తినేనమ: ' అని అనాలనిపిస్తోందమ్మా.

విద్యాదానం చేసిన మేస్టారి మంచితనం ఒక ఎత్తైతే ఆయన వెన్నంటి ఉంటూ మమ్మల్ని ఇలా తీర్చిదిద్దిన మీ ప్రేమ ఎత్తు దానికి పదింతలు.. ఇప్పుడు మీరు కాదని మా మనసులు బాధ పెట్టకండి. మేస్టారు మీరైనా అమ్మగారికి నచ్చచెప్పండి. ఇక అంతకంటే మాటలు రావడం లేదు మాకు" అన్నారు.. పూడుకుపోయిన గొంతులతో..

"గౌరమ్మా, ఇంక మాట్లాడకు.. పిల్లలు ముచ్చట పడి తెస్తే కాదంటావా? తీసుకో " అన్నారు మొదటిసారి వారి పక్షాన మాట్లాడుతూ..

మరొక గంట తర్వాత కొత్త బట్టలు కట్టుకుని వచ్చిన దంపతులకి నమస్కారం చేస్తూ బంగార్రాజు అడిగాడు.. "అమ్మా రాత్రికి కొబ్బరికాయ, మావిడికాయ పచ్చడి చేస్తున్నారు కదా " అని..

" అలాగేలేరా.. నువ్వంతల్లా అడగాలా? " అంటూ నవ్వింది గురుపత్ని. ***